ఎన్నికల హామీలు ఏమయ్యాయి?

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి సీఎం చంద్రబాబు మోసాలను వివరించడంతోపాటు గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమాన్ని వివరించారు. సూపర్ సిక్స్‌తోపాటు 143 హామీలిచ్చిన కూటమి నాయకులు వాటిని అమలు చేయకుండా వంచించిన విషయాన్ని గమనించాలని ప్రజలను కోరారు. చంద్రబాబు మోసాలతో కూడిన క్యూఆర్‌కోడ్ పత్రాలను పంపిణీ చేశారు. –సాక్షి నెట్‌వర్క్



సంతబొమ్మాళి: భావనపాడులో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న నాయకులు



వజ్రపుకొత్తూరు రూరల్: గరుడబద్రలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



నందిగాం: మాలపేటలో ర్యాలీ చేస్తున్న నాయకులు



మందస: భేతాళపురంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు



పలాస: అల్లుకోలలో వృద్ధురాలికి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న నాయకులు



వజ్రపుకొత్తూరు:దేవునల్తాడలో చంద్రబాబు మోసాలను మహిళలకు వివరిస్తున్న పార్టీ శ్రేణులు



టెక్కలి: పెద్దసాన గ్రామంలో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



కాశీబుగ్గ: 24వ వార్డులో క్యూఆర్ కోడ్ పత్రాలు ఆవిష్కరిస్తున్న పట్టణ పార్టీ నాయకులు



కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రాపురంలో కార్యక్రమం నిర్వహిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



కంచిలి: పోలేరు గ్రామంలో క్యూఆర్ కోడ్ పత్రాలను అందజేస్తున్న పార్టీ శ్రేణులు

క్లుప్తంగా

కళింగపట్నం పాఠశాలను సందర్శించిన డీఈవో



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో తిరుమలచైతన్య, ఎంఈవోలు

కవిటి: తీరప్రాంతమైన కళింగపట్నంలోని యూపీ పాఠశాలను డీఈవో ఎస్.తిరుమల చైతన్య శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంఈవోలు ధనంజయమజ్జి, రామకృష్ణ ఉన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్న అధికారులు

కంచిలి: విత్తనాలు, ఎరువుల అమ్మకాలు జరిపేటప్పుడు తప్పనిసరిగా బిల్లు రశీదు ఇవ్వాలని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రం కంచిలిలోని ప్రైవేటు ఫెర్టిలైజర్స్ దుకాణాలను శనివారం సందర్శించి పురుగు మందులు, ఎరువులు, విత్తనాల నిల్వలను, రిజిస్టర్లను తనిఖీ చేశారు. మండల వ్యవసాయాధికారి కె.సురేష్, డీటీ క్రిష్ణచంద్ర రాణో పాల్గొన్నారు.

గోశాల పరిశీలన



గోశాలను పరిశీలిస్తున్న అధికారులు

సోంపేట: బారువ మేజర్ పంచాయతీలోని బాలాజీ గోశాలను టెక్కలి పశువైద్య ఉపసంచాలకులు సీహెచ్ నరసింహులు శనివారం పరిశీలించారు. గోశాలలో ఉన్న పశువుల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. టెక్కలి గ్రామపంచాయతీ పరిధిలోని రహదారులపై విచ్చలవిడిగా తిరుగుతున్న 16 పశువులను బాలాజీ గోశాలకు ఇటీవల అప్పగించారు. వాటి ఆరోగ్య పరిస్థితి వివరాలు సేకరించారు. గోశాల సమస్యలను నిర్వాహకులు అధికారులకు తెలియజేశారు. సోంపేట ఏడీ అప్పలస్వామి, వైద్యాధికారిణి శిరీష ఉన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ పి.రాజలక్ష్మి అధ్యక్షతన శనివారం జరిగింది. 13 అంశాలతో కూడిన ఎజెండాకు కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య మాట్లాడుతూ.. 16వ వార్డులో అసంపూర్తిగా ఉన్న రోడ్లు, కాలువలు నిర్మించాలని, రైల్వేస్టేషన్ రోడ్‌లో ఎక్కువ కాంతిని వెదజల్లే విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలని కోరారు. 23వ వార్డు బెల్లుపడ కాలనీలో చెత్త సేకరణకు మరో కార్మికుడుని నియమించాలని కౌన్సిలర్ జి.ప్రదీప్ కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ పాల్గొన్నారు.

మెప్మా టీఎంసీగా భాస్కరరావు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మెప్మా టీఎంసీ (టౌన్‌మిషన్ కోఆర్డినేటర్) గా బోర భాస్కరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. మెప్మా సీవోలు సంతోష్, బాలరాజు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.

మహిళా సంఘాలకు శిక్షణ



మాట్లాడుతున్న సన్యాసిరావు

మందస: గ్రామ సమృద్ధి స్థాపన ప్రణాళికపై మహిళా సంఘాల అధ్యక్షులకు శిక్షణ ఇస్తున్న ఐటీడీఏ ఏపీడీ సన్యాసిరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల అధ్యక్షులకు శిక్షణ కార్యక్రమానిన శనివారం నిర్వహించారు. స్వయం సహాయక కుటుంబాల ఆదాయాభివృద్ధి, జీవనోపాధి కార్యక్రమాలతో పాటు ఆరోగ్య, పారిశుద్ధ్యం, సామాజిక భద్రత, సహజ వనరుల అభివృద్ధితో పాటు మహిళలు, మానవ అభివృద్ధి, సాంఘిక అంశాలపై సమగ్ర ప్రణాళిక తయారు చేసుకోవాలని ఐబీడీఎం మోహన్‌రావు వివరించారు. వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు, లీగల్ కోఆర్డినేటర్ తారక్ మోహన్, అకౌంటెంట్లు కళ్యాణి, కృష్ణకుమారి, డేటా ఎంట్రీఆపరేటర్ రాజారావు, క్లస్టర్ కో ఆర్డినేటర్లు, గ్రామ సంఘం అధ్యక్షులు, వీవోఏలు పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ

కాశీబుగ్గ: ప్రజలపైన ఎటువంటి భారాలు వేయమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలను పెంచి మోయలేని భారం వేసిందని వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. కాశీబుగ్గలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు మాట్లాడుతూ.. పెంచిన సర్దుబాటు చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయంలో స్మార్ట్ మీటర్లను బిగించినప్పుడు టీడీపీ నాయకులు వ్యతిరేకించారని.. స్మార్ట్ మీటర్లు బిగిస్తే ధ్వంసం చేయమని చెప్పిన మాటలు ఇప్పుడు ఏమయ్యాయో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లను రద్దుచేయాలని, కరెంట్ చార్జీలు తగ్గించాలని కోరుతూ ఆగస్టు ఐదో తేదీన మండల కేంద్రాల్లో జరిగే ధర్నా కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకమంలో సీపీఎం నాయకులు నెయ్యిల గణపతిరావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు పోతనపల్లి కుసుమ, మద్దిల రామారావు, బాలకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రవి, వీరస్వామి, అప్పన్న, ముకుందరావు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



కాశీబుగ్గ: పలాస డిగ్రీ కళాశాలలో వీరజవాన్లకు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి తదితరులు



వజ్రపుకొత్తూరు: పాతటెక్కలిలో ర్యాలీ చేస్తున్న మాజీ సైనికులు, విద్యార్థులు



ఇచ్ఛాపురం: కార్గిల్ వీరులకు నివాలర్పిస్తున్న మాజీ సైనిక ఉద్యోగులు

కార్గిల్ విజయ్ దివస్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధ చరిత్రను, భారత సైనికుల త్యాగాలను, దేశం కోసం ప్రాణాలర్పించిన వీరజవాన్ల ధైర్య సాహసాలను స్మరించుకోవాల్సిన ఆవశ్యకతను వక్తలు వివరించారు. విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకుని, దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొవ్వొత్తులతో వీర జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు.

–సాక్షి నెట్‌వర్క్

'అప్పులపై శ్వేత పత్రం విడుదల చేయాలి'

కాశీబుగ్గ: కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్పులపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు డిమాండ్ చేశారు. పలాసలో శనివారం ఆయన మాట్లాడుతూ..గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి అప్పులు చేస్తే అప్పట్లో ప్రతిపక్షంలోఉన్న టీడీపీ నేతలు ఆంధ్రప్రదేశ్ మరో శ్రీలంక అయిపోతుందంటూ దుష్ప్రచారం చేశారన్నారు. ఇప్పుడు కూటమి సర్కార్ ఏర్పడిన 14 నెలల్లో ఎన్నికోట్ల రూపాయలు అప్పులు చేశారు, అవి దేనికి ఖర్చు చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి సర్కార్ ప్రజలను మోసం చేస్తుందన్నారు.

28న 'బుద్ధునితో నా ప్రయాణం' నాటక ప్రదర్శన

టెక్కలి: బుద్ధునితో నా ప్రయాణం తెలుగు నాటక ప్రదర్శన విజయవంతం చేయాలని దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు కోరారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బౌద్ధ ధర్మ పునర్జీవన నేపథ్యంలో ఈ నెల 28న జిల్లా కేంద్రం శ్రీకాకుళంలోని బృందావనం ఫంక్షన్ హాల్‌లో ప్రదర్శించనున్న నాటిక ప్రదర్శనకు అన్నివర్గాలకు చెందిన మేధావులు, ఇతరులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఎరువుల పంపిణీ

ఇచ్ఛాపురం టౌన్ : మున్సిపాలిటీ పరిధి రత్తకన్న, బెల్లుపడ రైతులకు యూరియా, డీఏపీ ఎరువులను స్థానిక పీఏసీఎస్ వద్ద చైర్మన్ పి.బాబ్జీ శనివారం పంపిణీ చేశారు. వ్యవసాయ అధికారి పి.పి.వి.వి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎకరాకు 25 కిలోల యూరియా, 40 కిలోల డీఏపీ వేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు రైతుసేవా కేంద్రాలకు 1–బీ, ఆధార్ తీసుకొని వెళ్తే ఎరువుల కోసం కూపన్లు అందజేస్తామన్నారు. తహసీల్దార్ వెంకటరమణ, సీఈవో బి.భుజంగరావు పాల్గొన్నారు.

సుధారాణికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న సుధారాణి

వజ్రపుకొత్తూరు: మహదేవిపురం గ్రామానికి చెందిన వేగులాడ సుధారాణికి హైదరాబాద్ గీతం యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ మేరకు విశాఖపట్నంలోని గీతం వర్సిటీలో శనివారం జరిగిన స్నాతకోత్సవంలో బాష్ సాఫ్టవేర్ టెక్నాలజీస్ వైస్ ప్రెసిడెంట్ నవేద్ నారాయణ్ చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆమె కంప్యూటర్ సైన్స్ విభాగంలో 'డిజైన్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ ఆప్టిమైజేషన్, అల్గార్థమ్స్ అండ్ మిషన్ లెర్నింగ్ టెక్నిక్స్ ఫర్ ఏ కాంప్రేన్సివ్ ఇంట్రుషన్ డటక్షన్ సిస్టం ఫ్రేమ్ వర్క్'అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ వరించింది. ప్రస్తుతం సుధారాణి తెలంగాణాలో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో సహాయ ఆచార్యులుగా, ఇంజినీరింగ్ కలాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ఉపాధ్యాయుడు మృతికి సంతాపం

ఇచ్ఛాపురం రూరల్: ఉపాధ్యాయుడు మృతి పట్ల పూర్వ విద్యార్థులు సంతాపం తెలియజేశారు. హిందీ భాషోపాధ్యాయుడు జాడు బాబూరావు గతంలో డొంకూరు ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల మృతి చెందాడు. ఆయన వద్ద చదివిన పూర్వ విద్యార్థులు శనివారం డొంకూరు బస్టాండ్ కూడలిలో సంతాప సభను నిర్వహించి మాస్టార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

యూరియా స్టాకు ఉన్నా ఇవ్వడం లేదు!

టెక్కలి: రైతు సేవా కేంద్రంలో యూరియా స్టాకు ఉన్నప్పటికీ తమకు ఇవ్వడం లేదని అయోధ్యపురం గ్రామంలో పలువురు రైతులు శనివారం ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి వచ్చిన యూరియాను టీడీపీ కార్యకర్తలు ఇష్టారాజ్యంగా పంచిపెట్టేశారని, ఇప్పుడు రైతుల కోసం యూరియా అడుగుతుంటే తరువాత ఇస్తామంటూ దాటవేస్తున్నారని వాపోయారు.

వసతి గృహం పరిశీలన



బాలికల వసతి గృహంలో భోజనాలు పరిశీలిస్తున్న డీడీ అన్నాదొర

టెక్కలి: వసతి గృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నాదొర పేర్కొన్నారు. టెక్కలి గిరిజన బాలికల వసతి గృహం, గిరిజన బాలుర వసతి గృహాన్ని శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహం పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. భోజనాలు వండే ప్రాంతం పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

గిరిజన మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

సోంపేట: గిరిజన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సెర్ప్ ఏపీఎం ఎస్.ప్రసాదరావు అన్నారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ సౌజన్యంతో ఎం.జి.పురం పంచాయతీలో నిర్వహిస్తున్న వందన్ వికాస్ కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. అనంతరం పంచాయతీ పరిధిలో స్వయంశక్తి సంఘాల మహిళలు నిర్వహిస్తున్న పిండిమిల్లులు, పేపర్ ప్లేట్స్ తయారీ, అగర్ మిషన్లను పరిశీలించి సలహాలు సూచనలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గిరిజన మహిళల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీ జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

వజ్రపుకొత్తూరు రూరల్: బైపల్లిలోని అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.